రెండు బైకులు ఢీ.. చికిత్స పొందుతూ ఒకరి మృతి

మాలోత్ రవి(ఫైల్)

సంగెం, జూన్ 6 : రెండు బైకులు ఢీకొన్న ఘటనలో గాయాలైన వ్యక్తి ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం రౌతుగూడేనికి చెందిన మాలోత్ రవి(34) అతడి భార్య సరిత, తల్లి మాలోత్ సోనా సంగెం మండలంలోని తిమ్మాపురం గ్రామానికి బుధవారం వెళ్లారు. పని ముగించుకుని సాయంత్రం తిమ్మాపురం నుంచి బైక్‌పై వెళ్తుండగా సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎదురుగా బైక్‌పై వేగంగా వచ్చిన 15 సంవత్సరాల యువకుడు రవి నడుపుతున్న బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురు కింద పడిపోయారు. రవి, సోనాకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ రవి గురువారం మృతిచెందాడు. మృతికి కారకుడైన ఎల్గూర్‌రంగంపేట గ్రామానికి చెందిన పోతుల రాంచరణ్‌పై చర్యలు తీసుకోవాలని రవి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నరేశ్ తెలిపారు.

రైలు నుంచి పడి రైల్వే జూనియర్ ఇంజినీర్ దుర్మరణం

తరుణ్‌కృష్ణ(ఫైల్)

నెక్కొండ, జూన్ 6: కాజీపేట రైల్వేట్రాక్ మిషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన జూనియర్ ఇంజినీర్ దండుబోయిన తరుణ్ కృష్ణ(30) ఇంటికన్నె-నెక్కొండ రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి దుర్మరణం చెందినట్లు రైల్వేపోలీసులు గురువారం రాత్రి తెలిపారు. ఇంటికన్నె-నెక్కొండ రైల్వేస్టేషన్ల మధ్య 407/31-29 అప్‌లైన్‌లో రైలు నుంచి కృష్ణ ప్రమాదవశాత్తు రెండు ట్రాక్‌ల మధ్య పడిపోవడంతో తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై ఎం.ఐలయ్య తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

సంగెం, జూన్ 6 : బాలికతో సన్నిహితంగా మెలిగి పెళ్లికి నిరాకరించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసిన ఘటన మండలంలో జరిగింది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సోమ్లాతండాకు చెందిన బానోత్ చందూలాల్ (23) ఓ బాలికను 2021 సంవత్సరం నుంచి ప్రేమిస్తున్నానని నమ్మబలికి తరుచూ ఫోన్లో మాట్లాడుతూ బయటకు తీసుకుపోయి ఫొటోలు దిగాడు. బాలికతో సన్నిహితంగా మెలిగాడు. ఇప్పుడు పెళ్లి చేసుకోనని మోసం చేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు చందూలాల్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గురువారం నిందితుడిని కోర్టులో హాజరు పర్చామని చెప్పారు.

పిడుగుపాటుకు రెండు దుక్కిటెద్దుల మృతి

హసన్‌పర్తి, జూన్ 6: పిడుగుపాటుకు రెండు దుక్కిటెద్దులు మృతి చెందిన ఘటన గుంటూరుపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన పప్పు పాపిరెడ్డి బుధవారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఎడ్లను కట్టేసి, ఇంట్లో నిద్రించాడు. గురువారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో చెట్టుపై పిడుగు పడింది. దీంతో రెండు ఎడ్లు అక్కడికక్కడే మృతి చెందాయి. రూ.1.50 లక్షల నష్టం జరిగినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆత్మకూరులో నాగుపాముల సంచారం

నాలుగింటిని పట్టుకున్న సురేశ్

పామును పట్టిన సురేశ్

ఆత్మకూరు, జూన్ 6 : మండలకేంద్రంలో గురువారం నాలుగు ఇళ్లల్లోకి నాగుపాములు రావడంతో ప్రజలు భయందోళన చెందారు. కాగా, గ్రామానికి చెందిన తోట సురేశ్ చాకచాక్యంగా పాములను పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాల్లో బంధించాడు. అనంతరం పాములను అడవిలో వదిలిపెట్టారు. దీంతో ఆయా కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

శిథిలావస్థ భవనాల యజమానులకు నోటీసులు

వరంగల్, జూన్ 6 : వర్షకాలం నేపథ్యంలో గ్రేటర్ అధికారులు శిథిలావస్థలో ఉన్న భవనాలపై దృష్టిసారించారు. గ్రేటర్‌లో సుమారు 6 వందల ఇళ్లకుపైనే శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించారు. ఇంటి యజమానులకు నోటీసులు అందిస్తున్నారు. పూర్తిగా కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లను కూల్చివేస్తున్నారు. కొన్నిచోట్ల యజమానులు అందుబాటులో లేకపోవడంలో ఇళ్లకు నోటీసులు అంటిస్తున్నారు. పాత ఇళ్లు వర్షాలకు కూలిపోయే ప్రమాదం ఉండడంతో అందులో ఉంటున్న వారు ఖాళీ చేయాలని చెబుతున్నారు.

'సెక్యూరిటీ గార్డు మృతదేహానికి పోస్టుమార్టం చేయాలి'

కాశీబుగ్గ, జూన్ 6: ములుగురోడ్డు జంక్షన్‌లోని రియా దవాఖానలో బుధవారం సెక్యూరిటీ గార్డు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు అతడి కుమారుడు పల్లె వినోద్ మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే శవపంచనామా చేసి, తమకు న్యాయం చేయాలని కోరాడు. వివరాల్లోకి వెళ్తే.. పెద్దమ్మగడ్డకు చెందిన పల్లె మొగిలి(60) ములుగురోడ్డు జంక్షన్‌లోని రియా దవాఖానలో పదేళ్లుగా సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం సాయంత్రం 6 గంటలకు డ్యూటీలో చేరాడు. రాత్రి 9.25 గంటలకు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడాడు. గంట తర్వాత మొగిలి హాస్పిటల్ సెల్లార్‌లో పడిపోయి ఉన్నాడని, ముక్కు, చెవి నుంచి రక్తం కారుతున్నదని కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. వెంటనే వారు దవాఖానకు వెళ్లగా మృతిచెంది ఉన్నాడు. తన తండ్రి మృతిపై అనుమానాలు ఉన్నాయని, పోస్టుమార్టం చేసి, తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను వినోద్ కోరాడు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పరకాల : తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పరకాల/సంగెం, జూన్ 6 : విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పరకాల తహసీల్దార్ భాస్కర్, ఏవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పలు విత్తన షాపుల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. వ్యాపారులు అనుమతి ఉన్న విత్తనాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే విక్రయిచాలన్నారు. రైతులు తప్పకుండా రసీదులు తీసుకోవాలన్నారు. అలాగే, సంగెంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన షాపుల యజమానులతో ఏడీఏ గౌస్‌హైదర్ సమావేశం నిర్వహించారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై నరేశ్, ఏవో యాకయ్య, ఏఈవోలు, ప్రతినిధులు గజ్జెల శ్రీనివాస్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

'ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి'

హనుమకొండ చౌరస్తా, జూన్ 6 : విద్యను వ్యాపారంగా మారుస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. కేయూలోని జాఫర్ నిజాం సెమినార్ హాల్లో గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యాసంస్థలు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై మోయలేని భారాన్ని మోపుతున్నాయని మండిపడ్డారు. ఇంటర్నేషనల్, పబ్లిక్, సీబీఎస్సీ పేర్లతో లక్షలలో ఫీజు, పుస్తకాలు యూనిఫాం, బ్యాడ్జీల కోసం ఒక్కో విద్యార్థి నుంచి రూ.10 నుంచి 20 వేల వరకు వసూలు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. పీడీఎస్‌యూ నగరాధ్యక్షుడు రాచకొండ రంజిత్‌కుమార్, కేయూ ప్రధాన కార్యదర్శి మర్రి మహేశ్, వంశీ, కుమారు, గోవర్ధన్, దేవేందర్, సాయిచంద్, గణేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
JANGAON - 9182777565

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- పెంచికల్‌పేట, జీల్గుల పాఠశాలల్లో పనుల పరిశీలన

ఎల్కతుర్తి : జీల్గుల పాఠశాలలో నల్లాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఎల్కతుర్తి, జూన్ 6 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. గురువారం మండలంలోని పెంచికల్‌పేట, జీల్గుల ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను ఆమె పరిశీలించారు. విద్యార్థులకు ప్రత్యేకంగా టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. పెంచికల్‌పేటలో వంటగది నిర్మాణం కోసం విన్నవించగా ఈజీఎస్ నిధులో నిర్మించాలని పీఆర్ అధికారులకు సూచించారు. జీల్గుల గ్రామంలో పనులు అసంపూర్తిగా ఉండడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 12లోపు పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు నెలల క్రితం నిధులను కేటాయించి, జిల్లా వ్యాప్తంగా 300 పాఠశాలలను గుర్తించి వాటిల్లో సదుపాయాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 12లోగా పనులన్నీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మండలంలోని 35 పాఠశాలల్లోని విద్యార్థులకు యూనిఫాంలను అందిస్తామని చెప్పారు. ఎల్కతుర్తి ఐకేపీలోని ఎస్ఎస్‌జీల కేంద్రాన్ని సందర్శించి యూనిఫాంలు కుడుతున్న మహిళలను అభినందించారు. నోట్ బుక్కులు, టెక్ట్స్ బుక్కులు సైతం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ శంకరయ్య, డీఈ సాంబశివారెడ్డి, తహసీల్దార్ జగత్‌సింగ్, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఏఈ ప్రణవ్, ఎంపీవో రవి, ఏపీవో రవీందర్ పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్...

హనుమకొండ : గ్రూప్ -1 ప్రిలిమ్స్ నిర్వహణ, వానకాలం పంట సీజన్ విత్తనాలు, ఎరువుల లభ్యత, మిషన్ భగీరథ, తాగునీటి సరఫరాపై గురువారం సీఎస్ శాంతి కుమారి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ విత్తన విక్రయ కేంద్రాలను సందర్శించి అక్కడ ఉన్న రైతులతో మాట్లాడామని, రైతులంతా ఒకే కంపెనీ విత్తనాలు అడుగుతున్నారని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించి, వేరే కంపెనీ విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించామని చెప్పారు. జిల్లాలో 356 విక్రయ కేంద్రాల ఉన్నాయని, కేంద్రాలను తనిఖీ చేసేందుకు టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. డీఆర్డీఏ పీడీ నాగపద్మజ, డీఈవో అబ్దుల్ హై, వ్యవసాయ శాఖ ఉప సంచాలకుడు రవీంద్ర సింగ్ పాల్గొన్నారు.

'విద్యార్థిలో బృందచర్చ నైపుణ్యాలు పెంచాలి'

మాట్లాడుతున్న రాజావిశ్వనాథన్

హనుమకొండ చౌరస్తా, జూన్ 6 : విద్యార్థిలో బృంద చర్చ నైపుణ్యాలు పెంచాలని నిట్ ప్రొఫెసర్ రాజావిశ్వనాథన్ అన్నారు. కేయూ ఆంగ్ల విభాగంలో పాలిటెక్నిక్ అధ్యాపకులకు కొనసాగుతున్న 3 వారాల ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. గ్రూప్ డిస్కషన్‌లో ఉండాల్సిన వ్యూహాలు ఏంటి? ఇతరులు లేవనెత్తిన అభ్యంతరాలను ఎలా నివృత్తి చేయాలి? అందరి మన్నలను ఎలా పొందాలి? తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి దీపాజ్యోతి పాల్గొన్నారు.

పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షల రీషెడ్యూల్

హనుమకొండ చౌరస్తా, జూన్ 6 : కేయూ పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్ష టైం టేబుల్‌ను రీ షెడ్యూల్ చేస్తూ పరీక్షల నియంత్రణాధికారి నరసింహాచారి, అదనపు అధికారి బీఎస్ఎల్ సౌజన్య ఉత్తర్వులు విడుదల చేశారు. మొదటి పేపర్ 11న, రెండో పేపర్ 13న, మూడో పేపర్ 15న, నాలుగో పేపర్ 19న, ఐదో పేపర్ 21న, ఆరో పేపర్ 24న ఉన్నట్లు తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల మధ్య జరుగుతాయని, వివరాలకు వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి దూరవిద్య ఎమ్మెస్సీ ప్రాక్టికల్స్

హనుమకొండ చౌరస్తా, జూన్ 6 : కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం అందిస్తున్న పీజీ బోటనీ, జూవాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ కోర్సుల ప్రథమ సంవత్సరం విద్యార్థుల ప్రాక్టికల్స్ పరీక్షలు ఈ నెల 8 నుంచి జరుగుతాయని సంచాలకుడు వల్లూరి రామచంద్రం, సహాయ సంచాలకుడు బట్టి వెంకట గోపీనాథ్ తెలిపారు. ఈ నెల 8న వృక్షశాస్త్రం, 9న భౌతికశాస్త్రం, 12న జంతుశాస్త్రం, రసాయన శాస్త్రం, 13న రసాయనశాస్త్రం ప్రాక్టికల్స్ ఉంటాయని వివరించారు. పరీక్షలు రోజూ ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గిర్మాజీపేట, జూన్ 6: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో చేరేందుకు జూలై 10న నిర్వహించనున్న పరీక్షకు హాజరయ్యేందుకు ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో వాసంతి తెలిపారు. అర్హులు ఈ నెల 8 నుంచి 30వ తేదీ వరకు http://deecet.cdse.telangana.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

'షెడ్యూల్ విడుదల చేయాలి'

చెన్నారావుపేట, జూన్ 6: ప్రభుత్వ ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయాలని డీటీఎఫ్ చెన్నారావుపేట మండల అధ్యక్షుడు అంగోత్ భద్రయ్య కోరారు. గురువారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం చేపట్టిన పదోన్నతులు, బదిలీలు ఎన్నికల కారణంగా అమలు కాలేదని, తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, పెండింగ్ డీఏను మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శులు యాకయ్య, ఉమాశంకర్, రవి, కట్టస్వామి, వీరన్న, నర్సయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఐనవోలు, జూన్ 6: మరమ్మతుల్లో భాగంగా ఐనవోలు సబ్‌స్టేషన్ పరిధిలోని ఒంటిమామిడిపల్లి ఫీడర్‌లో ఒంటిమామిడిపల్లి, నాగపురం ఏజీఎల్స్, వెంకటాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపురం టౌన్, వెంకటాపురం ఏజీఎల్స్‌కు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఐనవోలు ఏఈ పద్మ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మొగిలయ్యను పరామర్శిస్తున్న వెంకటరమణ

'బలగం' మొగిలయ్యకు డీఎంహెచ్‌వో పరామర్శ

కాశీబుగ్గ, జూన్ 6: వరంగల్‌లోని సంరక్ష సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బలగం సినిమా ఫేమ్ గాయకుడు పస్తం మొగిలయ్యను గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో వెంకటరమణ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గీసుగొండ : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ అన్నారు. గురువారం గీసుగొండ పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను తప్పని సరిగా నిర్వహించాలని సూచించారు. వైద్యులు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అర్చన పాల్గొన్నారు.

శివనగర్‌లో ఒకరి ఆత్మహత్య

ఖిలావరంగల్, జూన్ 6: మానసికస్థితి సరిగా లేక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రాత్రి శివనగర్ రుద్రమాంబనగర్‌లో జరిగింది. మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య కథనం ప్రకారం.. రుద్రమాంబనగర్‌కు చెందిన ఆడెపు ప్రదీప్‌కుమార్(46) కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. అలాగే, మానసికస్థితి సరిగాలేకపోవడంతో ఇటీవల ఎంజీఎం దవాఖానలో కుటుంబ సభ్యులు చికిత్స చేయించారు. అయినా ఆరోగ్యం కుదట పడకపోవడం, వివాహం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన అతడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువతి అదృశ్యం

ఖిలావరంగల్, జూన్ 6 : యువతి అదృశ్యమైన ఘటన క్రిస్టియన్స్ కాలనీలో ఆలస్యంగా వెలుగు చూసింది. మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య కథనం ప్రకారం.. వరంగల్ క్రిస్టియన్స్ కాలనీకి చెందిన సింధు(19) ఈ నెల 5న కూరగాయలు తీసుకొచ్చేందుకు ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

కేయూలో కొనసాగుతున్న విచారణ

11 మంది రిమాండ్‌కు.. పరారీలో ఆరుగురు

హనుమకొండ చౌరస్తా, జూన్ 6 : కేయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో డిగ్రీ సెమిస్టర్ పరీక్ష పేపర్లు మార్చిన ఘటనపై విచారణ కొనసాగుతోంది. కాసులకు కక్కుర్తిపడిన కొంతమంది దినసరి వేతన కూలీలు ఆన్సర్ బుక్‌లెట్స్‌ను మార్చడంపై పరీక్షల నియంత్రణాధికారి నరసింహాచారి ఫిర్యాదు చేయగా ముగ్గురు కూలీలను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అయితే పోలీసుల విచారణలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పదేళ్లుగా ఎన్నో పేపర్లు మార్చినట్లు, ఇందులో ఎంతోమంది విద్యార్థులతో పాటు ప్రముఖ కాలేజీల పేర్లు బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో పలువురు విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాన్ని సైతం పోలీసులు విచారించినట్లు సమాచారం. మొత్తం 19 మంది వర్సిటీ దినసరి వేతన కూలీలను విచారించిన కేయూ పోలీసులు 11 మందిని రిమాండ్‌కు తరలించారు. మరో ఆరుగురు పరారీలో ఉన్నట్లు పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు. కాగా, గత సంవత్సరం యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో పని చేసే రెగ్యులర్ ఉద్యోగి దూరవిద్యా కేంద్రంలో బీఎల్ఐఎస్సీ ఆన్సర్ బుక్‌లెట్లను మార్చగా అప్పటి కంట్రోలర్ మల్లారెడ్డి ఇద్దరు దినసరి వేతన కూలీలను తొలగించారు. కానీ, ఆ రెగ్యులర్ ఉద్యోగిపై చర్యలు తీసుకోలేదు. పోలీసుల విచారణలో ఈ విషయం బయటకు రావడంతో గత ఏడాది ఎందుకు ఫిర్యాదు చేయలేదని వర్సిటీ అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. అప్పుడే చర్యలు తీసుకుంటే ఈ ఘటన పునరావృతమయ్యేది కాదని అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు గుసగుసలాడుకుంటున్నారు.

జల్సాలకు అలవాటు పడి బైక్ దొంగతనాలు

- విక్రయించేందుకు వెళ్లి పట్టుబడిన ముగ్గురు దొంగలు
- 8 బైక్‌ల స్వాధీనం, దొంగల అరెస్ట్
- వరంగల్ ఏసీపీ నందిరామ్‌నాయక్

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరామ్‌నాయక్

గిర్మాజీపేట, జూన్ 6: ద్విచక్ర వాహనాలను చోరీ చేసి విక్రయిస్తున్న ఓ ముఠాను ఇంతెజార్‌గంజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ మచ్చ శివకుమార్ అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ నందిరామ్‌నాయక్ వివరాలు వెల్లడించారు. రంగు ప్రశాంత్, ఈసంపెల్లి ప్రేమ్‌కుమార్, బాలుడు ముఠాగా ఏర్పడ్డారు. జల్సాలకు అలవాటు పడిన వారు అవసరాలు తీర్చుకునేందుకు సులభంగా డబ్బు సంపాదించాలని దొంగతనాలను ఎంచుకున్నారు. ఈ నేపథ్యంలో మొత్తం ఎనిమిది ద్విచక్ర వాహనాలను దొంగిలించి రంగు ప్రశాంత్ ఇంటి వద్ద దాచిపెట్టారు. ప్రశాంత్ సొంత ఊరైన నష్కల్, జనగామలో తెలిసిన వారికి మాయమాటలు చెప్పి మూడు బైక్‌లను అమ్మేందుకు అడ్వాన్స్‌గా రూ. 30 వేలు తీసుకున్నారు. గురువారం తెల్లవారుజామున వాటిని విక్రయించేందుకు ప్రశాంత్, ప్రేమ్‌కుమార్, బాలుడు బైక్‌లను తీసుకెళ్తుండగా పోస్టాఫీస్ చౌరస్తా వద్ద పోలీసుల తనిఖీల్లో వారు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా బైక్ దొంగతనాలు చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. ఈ మూడు బైక్‌లతోపాటు ప్రశాంత్ ఇంటి వద్ద ఉన్న మరో ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ చెప్పారు. దొంగల ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. సమావేశంలో ఎస్సై వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

వరంగల్ : ఎల్బీ కాలేజీలో మాట్లాడుతున్న డీసీపీ బారి

ఖిలావరంగల్ : బొల్లికుంటలో సదస్సుకు హాజరైన పోలీసులు

ఖిలావరంగల్/వరంగల్, జూన్ 6 : వచ్చే నెల ఒకటి నుంచి అమలు కానున్న నూతన చట్టాలపై ప్రతి పోలీసు అధికారి అవగాహన కలిగి ఉండాలని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ సూచించారు. బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మామునూరు, పరకాల, నర్సంపేట డివిజన్లకు చెందిన పోలీసు అధికారులకు కొత్త చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్పించేందుకు విడతల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం-2023 చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే విధులను సమర్థవంతంగా నిర్వహించొచ్చన్నారు. సదస్సులో ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, ఎల్బీ కాలేజీలో సెంట్రల్ జోన్ పరిధిలోని పోలీసు సిబ్బందికి డీసీపీ అబ్దుల్ బారి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీపీలు నందిరాం నాయక్, దేవేందర్‌రెడ్డి, సీఐలు గోపి, శివకుమార్, మల్లయ్య, సంజీవ్, సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బోల్లోనిపల్లెలో కళాజాత

నల్లబెల్లి, జూన్ 6: పోలీస్ జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో బోల్లోనిపల్లెలో బుధవారం రాత్రి చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సర్కారు బడులకు పాఠ్యపుస్తకాలు

నల్లబెల్లి, జూన్ 6: త్వరలో విద్యాసంవత్సరం ప్రారంభం కానున్నందున ప్రభుత్వం పాఠ్యపుస్తకాలతోపాటు నోట్‌బుక్స్‌ను విడుదల చేసింది. ఈ మేరకు మండలంలోని 34 సర్కారు బడులకు 9500 పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ మంజూరయ్యాయి. ఎమ్మార్సీ కార్యాలయంలో మండల నోడల్ అధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో గురువారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలు, నోట్‌బుక్స్ అందించారు.

సూచిక బోర్డుల ఏర్పాటు

బాలసముద్రంలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

హనుమకొండ, జూన్ 6 : బాలసముద్రం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం కాలనీల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు సభ్యులు తెలిపారు. కాలనీ అభివృద్ధి కమిటీ సొంత డబ్బు సుమారు రూ.1.50లక్షలతో బోర్డ్స్ ఏర్పాటు చేసుకున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు నామిరెడ్డి సీతారాంరెడ్డి, గుర్రాల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. కాలనీలో కమర్షియల్ కాంప్లెక్సులు, హాస్పిటల్స్ నిర్మిస్తున్న నేపథ్యంలో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, డ్రైనేజీ, పార్కులను మరింత అభివృద్ధి చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కమిటీ ఉపాధ్యక్షుడు రెంటాల కేశవరెడ్డి పాల్గొన్నారు.

'ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి'

పర్వతగిరి, జూన్ 6: ప్రతి వ్యాపారి విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని ఎంపీడీవో శంకర్ అన్నారు. మండలకేంద్రంలోని జీపీ కార్యాలయంలో గురువారం ఆయన ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేశారు. వ్యాపారులు ఏటా ట్రేడ్ లైసెన్స్ తీసుకుని తమ తమ వ్యాపారాలు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో పాక శ్రీనివాస్, కార్యదర్శి రఘు, జీపీ సిబ్బంది కరుణాకర్ పాల్గొన్నారు.

వర్షానికి ఇండ్లలోకి చేరిన నీరు

ఇంటి ఆవరణలోకి చేరిన నీరు

ఖానాపురం, జూన్ 6: అశోక్‌నగర్‌లో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ఎస్సీకాలనీలోని పలువురి ఇళ్లలోకి నీరు చేరింది. తేలికపాటి వర్షాలకే రోడ్లన్నీ జలమయమై ఇళ్లలోకి నీరు చేరుతున్నదని గ్రామస్తులు వాపోతున్నారు. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వకుండా గ్రామ పంచాయతీ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

పనులు పరిశీలిస్తున్న గోపాల్‌నాయక్

ఖిలావరంగల్, జూన్ 6: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఏడీఆర్ఎంఐ ఎం గోపాల్‌నాయక్ గురువారం పరిశీలించారు. ఎస్కలేటర్లు, లిఫ్టులు, ఇతరాత్ర అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. అలాగే, ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఆయన వెంటన సీనియర్ డీసీఎం వై బాలాజీకిరణ్, సీసీఐ రాజగోపాల్, బాలరాజు ఉన్నారు.

ఊరూరా 'బడిబాట' ప్రారంభం

- ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు
- పాల్గొన్న ఉపాధ్యాయులు

పర్వతగిరి: విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న మండల ప్రత్యేకాధికారి, డీసీవో సంజీవరెడ్డి

ధర్మసాగర్ : బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న మల్లక్‌పల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

నర్సంపేటరూరల్/ఐనవోలు/చెన్నారావుపేట/ఖానాపురం, జూన్ 6: ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నర్సంపేట మండలంలోని రాజేశ్వర్‌రావుపల్లి, దాసరిపల్లిలో మాజీ సర్పంచ్‌లు బొజ్జ యువరాజ్, శ్రీనివాస్, దాసరిపల్లి ఎంపీపీఎస్ హెచ్‌ఎం శోభన్‌బాబు మాట్లాతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలన్నారు. ముగ్దుంపురంలో జరిగిన కార్యక్రమాన్ని ఎంపీవో అంబటి సునీల్‌కుమార్ రాజ్ ప్రారంభించారు. ఐనవోలు మండలంలో ఉపాధ్యాయులు పలువురు విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించారు. చెన్నారావుపేటలో బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరళ, రజిని, ఇంద్రసేనారెడ్డి, ఇల్ల సూరయ్య, సీఆర్‌పీ సంపత్ పాల్గొన్నారు. ఖానాపురం మండలవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి బడిలో పిల్లలను చేర్పించాలని కోరారు.

ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య

పర్వతగిరి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల ప్రత్యేకాధికారి, డీసీవో సంజీవరెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని కోరారు. స్కూళ్లు ప్రారంభమయ్యేలోగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అన్ని పాఠశాలల్లో అందుబాటులో ఉంటాయని నోడల్ అధికారి లింగారెడ్డి, ఎంపీడీవో శంకర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో పాక శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం కృష్ణమూర్తి, పర్వతగిరి, కొంకపాక కాంప్లెక్స్ హెచ్ఎంలు పాక రమేశ్, భిక్షపతి, హెచ్ఎంలు, ఐకేపీ సీసీలు రవీందర్‌రాజు, వర్కాల సుధాకర్, బీ కాంతయ్య, రమాదేవి పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌ను బడిలో చేర్పించాలి

దామెర/ధర్మసాగర్ : దామెరలో బడి మానేసిన పిల్లలు తిరిగి బడిలో చేరాలని కోరుతూ గురువారం ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ తీశారు. హెచ్ఎం లకావత్ రాజేశ్‌కుమార్, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మల్లిక, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సబిత, నవీన్, కమలాకర్, ఉమ, మహేశ్వర్, కవిత, కళావతి, విజయలక్ష్మి, సీఆర్‌పీ రాజు పాల్గొన్నారు. ధర్మసాగర్ మండలంలోని మల్లక్‌పల్లిలో నిర్వహించిన బడిబాట ర్యాలీలో ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం నాగేశ్వరి, ఎల్లమ్మ, రమాదేవి, రాజ్‌మహ్మద్, వినయ్‌కుమార్, భిక్షపతి, మైసయ్య, నవీన్‌కుమార్, స్వరూపారాణి పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో శునకం పూజలు!

ఆలయంలో శునకం

కాశీబుగ్గ, జూన్ 6: కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా కాలబైరవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో ఎక్కడి నుంచో వచ్చిన శునకం కాలబైరవుడి పూజ ప్రారంభమైనప్పటి నుంచి కార్యక్రమం ముగిసే వరకూ సాష్టాంగంగా పడుకొని తిలకించింది. కాళబైరవుడి వాహనం శునకం కావడంతో ఆలయానికి వచ్చిన భక్తులు కుక్కను ఆశ్చర్యంగా చూశారు. కాలబైరవుడికి పెట్టిన రొట్టెలను భక్తులు కుక్కకు తినిపించారు. ఈ సన్నివేశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.